# బీఆర్‌ఎస్ జోష్

- అందరికంటే ముందే ప్రచారం
- దూసుకుపోతున్న అభ్యర్థులు
- అన్ని నియోజకవర్గాల్లో ముమ్మరం
- యువత చేరికతో బీఆర్‌ఎస్‌లో మరింత ఉత్సాహం
- ఇంకా ఖరారుకాని ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు



కరీంనగర్ రూరల్: గోపాల్‌పూర్‌లో మంత్రి గంగులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు



మల్యాల: మానాలలో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధికార బీఆర్‌ఎస్ ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటోంది. ఎన్నికలు జరిగిన ప్రతీసారి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అభ్యర్థులను ముందే ప్రకటించి విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఇంకా అభ్యర్థులు ఎవరనేది ఖరారు కాకముందే బీఆర్‌ఎస్ అభ్యర్థులు కార్యకర్తలతో సమావేశాలు, ముఖ్యనాయకులతో మంతనాలు, ప్రచార వ్యూహాలను సిద్ధం చేసుకుని ప్రజల్లోకి వెళ్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఎవరు ఎక్కడి నుంచి పోటీలో ఉంటారనేది ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఆ పార్టీల్లో అంతర్గత కుమ్ములాటలు అభ్యర్థుల ఎంపికకు ఆటంకాలుగా మారాయి. అంతే కాకుండా, కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఎవరు పోటీ చేయాలనే విషయంలో ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. పోటీ ఎవరు చేయాలనే సమాలోచనల్లోనే కాంగ్రెస్, బీజేపీ కనిపిస్తున్నాయి. హుస్నాబాద్ సహా కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ తన అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో నిలిపింది. దీంతో కార్యకర్తలు కూడా ఉత్సాహంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



కరీంనగర్ రూరల్: గోపాల్‌పూర్ సమావేశానికి హాజరైన ప్రజలు



జగిత్యాల అర్బన్: మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ సంజయ్ కుమార్



కొత్తపల్లి: చింతకుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలో రైతును ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గోదావరిఖని, 13వ డివిజన్ విఠల్‌నగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పెద్దపల్లి రూరల్: కుర్మపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మంగళ హారతులు, పూల వర్షంతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



పెద్దపల్లి: మాజీ కౌన్సిలర్ ఇల్లందుల రజనిని ఆప్యాయంగా అలింగనం చేసుకుంటన్న మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి



జమ్మికుంట: జగ్గయ్యపల్లి సమావేశానికి హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి



మేడిపలి: బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి కార్యకర్త సమావేశంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు

## జోరుగా ప్రచారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలో జరిగిన యువజన సమ్మేళనంలో, కరీంనగర్ మండలంలో జరిగిన పార్టీలో చేరికల కార్యక్రమంలో పాల్గొంటూ నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొడిమ్యాలలో తన ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ మండలంలోని అనేక గ్రామాల్లో ఇప్పటికే ప్రచారం ముగించుకుని, మల్యాల మండలంలో ప్రచారం చేస్తున్నారు. ఇటు హుజూరాబాద్ నియోజకవర్గంలో అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కూడా హుజూరాబాద్ మండలం, పట్టణంలోని పలు వార్డుల్లో నాలుగు రోజుల నుంచే ప్రచారం ప్రారంభించారు. మానకొండూర్‌లో అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ షెడ్యూల్‌కు ముందు విస్తృతంగా పర్యటించారు. జగిత్యాలలో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ ఎల్ రమణ జగిత్యాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జోరుగా ప్రచారం చేస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కోరుట్లలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో పాటు ఆయన తనయుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వేములవాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రచారం చేయడంతో పాటు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ సమాయత్తం చేస్తున్నారు. సిరిసిల్లలో పార్టీ శ్రేణులు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దిన మంత్రి కేటీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించి రుణం తీర్చుకుందామంటూ ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 17న జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరుతున్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రజాశీర్వాద యాత్ర పేరుతో ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. మంథని నియోజకవర్గంలో పుట్ట మధు ఇప్పటికే ప్రజాశీర్వాద యాత్ర పేరుతో పాదయాత్ర నిర్వహించి బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ పెంచారు. ఇలా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు నిత్యం ప్రజల్లో గడుపుతూ ఇటు ప్రజా హిత కార్యక్రమాలతోపాటు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నారు.

## ప్రజాక్షేత్రంలోనే అభ్యర్థులు

బీఆర్‌ఎస్ అభ్యర్థులు అనునిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే పార్టీ మరోసారి అవకాశం కల్పించడంతో షెడ్యూల్‌కు ముందు ప్రభుత్వ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతోపాటు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపారు. షెడ్యూల్ విడుదల కావడంతో అన్ని నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ప్రారంభించి, ఇంటింటికీ వెళ్తున్నారు. ప్రతి ఒక్కరినీ కలిసి మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తామని కోరుతున్నారు.

## చేరికల జోరు

అధికార బీఆర్‌ఎస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులవుతున్న పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆ పార్టీలో చేరుతున్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజవకర్గంలో మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు నాయకుల, కార్యకర్తలు ఇప్పటికే బీఆర్‌ఎస్‌లో చేరారు. కరీంనగర్ నగరంలో బీజేపీకి అండగా నిలిచిన సోషల్ మీడియా టీంలో కీలకంగా వ్యవహరించిన నాయకులు, కార్యకర్తలు సైతం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కరీంనగర్, కొత్తపల్లి మండలాలకు చెందిన అనేక మంది రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్శితులై పార్టీలో చేరుతున్న వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఇటు మానకొండూర్‌లోనూ చేరికలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. హుజూరాబాద్‌లో గత ఎన్నికల్లో బీజేపీవైపు మొగ్గ చూపిన యువకులు ఇప్పుడు యువకుడైన అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథనిలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.



కథలాపూర్: పోతారం ఇంటింటా ప్రచారంలో కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్న నాయకులు



మేడిపల్లి : వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు నాగలిని బహూకరిస్తున్న లింగంపేట రైతులు



మల్యాల: తక్కళ్లపల్లిలో ఎమ్మెల్యే ప్రచార ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

# అల్లరి

ALLARI

### చెప్పుకోండి



1. 'వందేమాతరం' గేయం ఏ నవల నుంచి తీసుకున్నారు?
2. పేపర్ కరెన్సీని విడుదల చేసిన మొదటి దేశం ఏది?
3. ఛత్రపతి శివాజీ రైల్వే టెర్మినస్ ఏ నగరంలో ఉన్నది?


## అత్యాశ

**కథ**

ఒక దట్టమైన అడవిలో ఓ గండుచీమ ఉండేది. ఒకరోజు దానికి నీటిపై ప్రయాణం చేయాలని ఆశ పుట్టింది. ఇంతలో పక్కనే ఉన్న చెట్టు నుంచి ఒక ఆకు రాలి కిందపడింది. దాంతో చీమ.. ''మిత్రమా! నాకు నీళ్లలో విహరించాలని ఉంది. నన్ను నీటిపై తీసుకెళ్తావా?'' అని అడిగింది. అందుకు ఆ ఆకు ''సరే!'' అన్నది. చీమను ఎక్కించుకుని.. నీటిపై ప్రయాణం చేయసాగింది ఆకు. అలా ప్రయాణిస్తున్న ఆ గండుచీమకు.. నీటి లోపల ఈత కొడుతున్న చేపపిల్ల కనిపించింది. అప్పుడు చీమ.. 'ఇలా ఆకుపై కూర్చొని ప్రయాణించడం ఏమంత బాగాలేదు. అలా చేపలా సొంతంగా ఈత కొట్టడంలోనే అసలైన ఆనందం ఉంది!' అనుకున్నది. వెంటనే చేపతో.. ''చేప మిత్రమా! నాకు నీలా నీటిలోపల మునకలు వేస్తూ తిరగాలని ఉంది. కొంచెం ఈత నేర్పించవా!?'' అని వేడుకుంది. చేప కూడా ''సరే!'' అంటూ, చీమకు ఈత ఎలా కొట్టాలో నేర్పించింది. దాంతో చీమ ఆనందంగా ఈత కొట్టసాగింది. నీటిపై ఈదుతూ.. గాలిలో ఎగురుతున్న పిచ్చుకను చూసింది చీమ. అంతే! ఎలాగైనా సరే తాను కూడా గాలిలో ప్రయాణించి తీరాలని నిర్ణయించుకుంది. పిచ్చుకను పిలిచి.. ''పిచ్చుక బావా! నన్ను గాలిలో తిప్పవా!?'' అని బతిమిలాడింది. పిచ్చుక కూడా కాదనలేక.. ''సరే!'' అంటూ, తన వీపుపై ఎక్కించుకుని గాలిలో తిప్పింది. అయితే, చీమకు మళ్లీ అత్యాశ కలిగింది. 'ఇలా పిచ్చుక వీపు మీద ప్రయాణించడం కన్నా.. నేనే స్వయంగా గాలిలో ఎగిరితే అద్భుతంగా ఉంటుంది కదా!' అనుకున్నది. ఆ ముచ్చటను పిచ్చుకతో చెప్పింది. ''నాకూ నీలా ఎగరాలని ఉంది. నీ ఈకలు ఇస్తే ఎగురుతాను!'' అన్నది. అందుకు పిచ్చుక.. ''అలా వీలుకాదు మిత్రమా! గాలిలో ఎగరాలంటే రెక్కలు ఉండాలి. అంతేకానీ, ఇలా ఈకలను కట్టుకొని ఎగరలేవు!'' అని చెప్పింది. అయినా చీమ వినిపించుకోలేదు. ''ఫరవాలేదు! నేను ఎగురుతాను. వాటిని నా ఒంటికి అంటించుకున్నాక.. నన్ను పైనుంచి వదిలేయి. అలాగే ఎగురుకుంటూ కిందికి వస్తాను!'' అంటూ మంకుపట్టు పట్టింది చీమ. చేసేది లేక ''సరే! నీ ఇష్టం!'' అంటూ పిచ్చుక తన రెండు ఈకలను చీమకు అంటించి.. గాల్లో వదిలేసింది. అంతే! చీమ గింగిరాలు కొడుతూ కిందపడింది. ఇంకేముంది... దట్టమైన ముండ్ల పొదలో ఇరుక్కోవడంతో బయటికి వచ్చే ప్రయత్నంలో కాళ్లు విరిగి, ఓ మూలన కూర్చుంది. అత్యాశ వల్లే తనకీ గతి పట్టిందని ఎంతో దుఃఖించింది.

**నీతి :** దురాశకు పోకుండా దొరికిన దానితో తృప్తిచెందడం మేలు!

• కయ్యూరు బాలసుబ్రమణ్యం



### చిట్టి హ్యాండ్స్





పి. రమేశ్, కాటారం.

### పెద్దల మాట



అందరూ గొప్పగొప్ప సేవలు చేయలేరు. కానీ, చిన్నపాటి సేవ చేసినా గొప్పగా ఉండాలి.

• మదర్ థెరిస్సా

### పదసృష్టి

కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Heart

Ex : Art

చెప్పుకోండి జవాబులు: 1. ఆనందమఠ్, 2. చైనా, 3. ముంబై


### కనుక్కోండి

కింది బొమ్మ సరైన నీడను కనుక్కోండి.



### తేడాలు కనుక్కోండి

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 6 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com